TGTEL/26/A5513

వార్తా దీపిక

ప్రచురణ :సంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 61 | 30 శుక్రవారం అక్టోబర్ 2026 | వెల: 02 | పేజీలు:04

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

తెలంగాణలో 102 స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ఎంపికైన వారికి రూ.1.06 లక్షల వరకు వేతనం

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఆర్థిక, గణాంక శాఖలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 102 పోస్టులను భర్తీ చేయనున్నట్లు ప్రకటించింది. వీటిలో మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఎంపీఎస్ఓ), డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (ఏఎస్ఓ) పోస్టులు ఉన్నాయి. అక్టోబర్ 30 నుంచి ఈ పోస్టులకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుండగా, నవంబర్ 27 వరకు అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన అర్హతలు, వయోపరిమితి, ఫీజు వివరాలను టీజీపీఎస్సీ స్పష్టంగా వెల్లడించింది. ...మిగతా 2 లో...



నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు..

కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పిన కొండా సురేఖ
- గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటన
- రేవంత్ రెడ్డి క్యాబినెట్ నుంచి తొలగించిన తర్వాత ఈ పరిణామం
- కొండా దంపతులు తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలకు బలం



తెలంగాణ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి, కాంగ్రెస్ నాయకురాలు కొండా సురేఖ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు క్షమాపణ చెప్పారు. గతంలో ఆయనపై చేసిన వ్యక్తిగత, నిరాధారమైన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. ఈ పరిణామంతో ఆమె తిరిగి బీఆర్ఎస్‌లో చేరతారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. ...మిగతా 2 లో...

రామ్‌లీలా మైదానానికి తరలిరండి..

విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి...



- ప్రజాస్వామ్యం, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమం అని వెల్లడి
- ఇది ఏ ఒక్క పార్టీకి సంబంధించిన కార్యక్రమం కాదని స్పష్టం
- భయపడకుండా విద్యార్థులు తరలిరావాలని ప్రత్యేక విజ్ఞప్తి
- పోలీసులకు, లాఠీలకు భయపడొద్దని యువతకు ధైర్యం చెప్పిన రాహుల్


కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న 'చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్'కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజా స్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని, ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ...మిగతా 2 లో...

నవంబర్ 2న హైదరాబాద్‌లో

బీజేపీ మహా పాదయాత్ర

- పాదయాత్రతో పాటు భారీ సభకు యోచన
- అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరు
- ట్యాంక్‌బండ్ మార్గంపై పునరాలోచన
- నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ పరిశీలన

బీజేపీ మహా పాదయాత్ర ట్యాంక్‌బండ్‌పై కాదా? అమిత్ షా రాకతో మారుతున్న ప్లాన్!



హైదరాబాద్‌లో నవంబర్ 2న నిర్వహించనున్న బీజేపీ మహా పాదయాత్రకు సంబంధించి పార్టీ కీలక మార్పుల దిశగా ఆలోచిస్తోంది. తొలుత ట్యాంక్‌బండ్ నుంచి పాదయాత్ర చేపట్టాలని భావించినప్పటికీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరవుతుండటంతో రూట్‌ను మార్చే యోచనలో ఉన్నట్లు సమాచారం. భద్రతా ఏర్పాట్లు, పరిపాలనాపరమైన అంశాలతో పాటు భారీగా కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉండటంతో ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

...మిగతా 2 లో...



చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్..

తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

- ఎందుకుందని ప్రభుత్వంపై విమర్శ
- కొండా సురేఖ ఏం చెప్పారో పూర్తిగా చూడలేదని వెల్లడి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినంకరవు పరిస్థితులపై స్పందిస్తూ, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆయన ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరింబు పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించారని కేటీఆర్ అన్నారు. పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది '30 శాతం కమీషన్ సర్కార్' అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని కూడా తెలిపారు.


...మిగతా 2 లో...

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన..

వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే

- రామ్‌లీలా మైదానంలో భారీ కార్యక్రమం
- నిరసన వాయిదా ఉండదన్న మల్లికార్జున ఖర్గే
- పండుగల సీజన్ దృష్ట్యా వాయిదా కోరిన వ్యాపార సంఘాలు
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యమన్న రాహుల్ గాంధీ

ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ...మిగతా 2 లో...





ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి వ్యాఖ్యలపై చర్యలు తప్పవు: టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

- బిల్లుల కోసం చావడానికి కూడా సిద్ధమేనన్న అనిరుధ్ రెడ్డి
- అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామన్న మహేశ్ గౌడ్
- నిధుల కొరత రాష్ట్రవ్యాప్తంగా ఉందన్న పీసీసీ చీఫ్

సొంత పార్టీ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అనిరుధ్ వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, ఈ వ్యవహారించారు. "జడకోసం చనిపోవడానికైనా సిద్ధం" అని అనిరుధ్ రెడ్డి ఇటీవల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సొంత ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా ఉన్న ఈ వ్యాఖ్యలను పార్టీ అధిష్ఠానం సీరియస్ గా తీసుకుంది.

...మిగతా 2 లో...

TGTEL/26/A5513
వార్తదీపిక

వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు.

వాయిదా వేయాలని వ్యాపార సంఘాల విజ్ఞప్తి

పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే: రాహుల్ గాంధీ

మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.నవంబర్ 1న దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఢిల్లీకి తరలివచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతకుముందు రోజు, అంటే అక్టోబర్ 30న, 'మాక్ పార్లమెంట్' నిర్వహించనున్నట్లు ఖర్గే వెల్లడించారు.

నవంబర్ 2న హైదరాబాద్‌లో బీజేపీ మహా పాదయాత్ర

మొదటిపేజీ తరువాయి

అమిత్ షా పాల్గొనే ఈ కార్యక్రమానికి భారీగా జనసమీకరణ చేయాలని బీజేపీ భావిస్తోంది. పాదయాత్రతో పాటు చివర్లో భారీ బహిరంగ సభ నిర్వహించే ఆలోచనలోనూ ఉంది. ఈ నేపథ్యంలో సభకు అనువైన ప్రాంతంగా నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌ను పార్టీ ముఖ్య నేతలు పరిశీలించినట్లు సమాచారం.ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియపై కాంగ్రెస్, ఇండియా కూటమి చేస్తున్న విమర్శలను తిప్పికొట్టడమే లక్ష్యంగా బీజేపీ ఈ మహా పాదయాత్రను నిర్వహించనుంది. ఓటర్ల జాబితాల సవరణపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, విపక్షాల ఆరోపణలకు సమాధానం చెప్పాలని పార్టీ భావిస్తోంది.నవంబర్ 2న జరగనున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వం వహించనున్నారు. అమిత్ షా రాకతో కార్యక్రమాన్ని మరింత భారీ స్థాయిలో నిర్వహించేందుకు పార్టీ ఏర్పాట్లు చేస్తోంది. అయితే పాదయాత్ర ఎక్కడి నుంచి ప్రారంభమవుతుంది? ఏ మార్గంలో సాగుతుంది? బహిరంగ సభ ఎక్కడ జరుగుతుంది? అనే అంశాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

నేను అప్పుడు అలా మాట్లాడాల్సింది కాదు.. కేటీఆర్‌కు సారీ చెప్పిన కొండా సురేఖ

మొదటిపేజీ తరువాయి

అప్పట్లో ప్రతిపక్షంపై చేసిన రాజకీయ విమర్శల్లో భాగంగానే ఆ వ్యాఖ్యలు చేశానని, కేటీఆర్‌ను గానీ, ఆయన కుటుంబ సభ్యులను గానీ ఉద్దేశపూర్వకంగా కించపరిచే ఉద్దేశం తనకు లేదని సురేఖ తన పోస్టులో స్పష్టం చేశారు. ఆ వ్యాఖ్యలను పూర్తిగా ఉపసంహరించుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు.ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన క్యాబినెట్ నుంచి కొండా సురేఖను తొలగించిన కొన్ని రోజులకే ఈ పరిణామం జరగడం గమనార్హం. సరైన వివరణ ఇవ్వకుండా తనను మంత్రి పదవి నుంచి తొలగించడంపై ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీసీ మహిళను కావడం వల్లే తనను తప్పించారా అని కూడా ప్రశ్నించారు.ఈ నేపథ్యంలో కొండా సురేఖ, ఆమె భర్త మురళి కాంగ్రెస్‌ను వీడి తిరిగి సొంత గూటికి (బీఆర్ఎస్) చేరవచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది. కేటీఆర్‌తో ఉన్న పాత విభేదాలను పరిష్కరించుకుని, పార్టీలో చేరేందుకు మార్గం సుగమం చేసుకోవడంలో భాగంగానే ఈ క్షమాపణ చెప్పారని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఈ పరిణామంపై బీఆర్ఎస్ నాయకత్వం నుంచి ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నుంచి కొత్త నోటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి

స్టాటిస్టిక్స్‌ను ప్రధాన సబ్జెక్టుగా చదివి డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు మాత్రమే ఈ ఉద్యోగాలకు అర్హులు. వయోపరిమితి విషయానికొస్తే, 2026 జులై 1 నాటికి అభ్యర్థుల వయసు కనీసం 18 ఏళ్లు నిండి, 44 ఏళ్లకు మించకూడదు. అయితే, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు వంటి రిజర్వ్‌డ్ కేటగిరీల అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయి. దరఖాస్తు రుసుముగా ఓసీ, బీసీ అభ్యర్థులు రూ.1000 చెల్లించాల్సి ఉండగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించారు. ఆకర్షణీయమైన వేతనం.. కీలకమైన బాధ్యతలు ఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఆకర్షణీయమైన వేతన స్కేలుతో పాటు సమాజంలో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుంది. కమిషన్ ప్రకటించిన ప్రకారం, ఉద్యోగంలో చేరిన వారికి నెలవారీ వేతనం రూ.36,750 నుంచి రూ.1,06,990 వరకు ఉంటుంది. ప్రభుత్వ పథకాల ప్రణాళిక, అమలులో ఈ పోస్టులది కీలక పాత్ర. మండల స్థాయిలో ప్రభుత్వానికి అవసరమైన గణాంకాలను సేకరించడం, వాటిని విశ్లేషించడం, అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించడం వంటివి వీరి ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి. పరీక్ష విధానం.. ముఖ్యమైన తేదీలు ఈ పోస్టుల భర్తీకి సంబంధించి రాత పరీక్షను జనవరి నెలలో నిర్వహించేందుకు కమిషన్ సన్నాహాలు చేస్తోంది. పరీక్షకు వారం రోజుల ముందుగా అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అక్టోబర్ 30న దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానున్నందున, ఆసక్తిగల అభ్యర్థులు చివరి తేదీ అయిన నవంబర్ 27 వరకు వేచి ఉండకుండా వీలైనంత త్వరగా దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. జోన్ల వారీగా ఖాళీలు, సిలబస్, పరీక్ష విధానం వంటి పూర్తి వివరాల కోసం అధికారిక నోటిఫికేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులు సూచిస్తున్నారు. ఏవైనా మార్పులు ఉంటే, వాటిని కమిషన్ అధికారిక వెబ్‌సైట్ ద్వారానే వెల్లడిస్తుంది.

విద్యార్థులకు రాహుల్ గాంధీ విజ్ఞప్తి...

మొదటిపేజీ తరువాయి

ఈ కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ వైఖరితో విభేదించే ప్రతి ఒక్కరూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పౌరులందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు."మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, జీవన విధానంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ మార్చ్‌కు తరలిరండి. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దు. బీజేపీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడే సాహసం చేయదు" అని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, దీనిని విజయవంతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

చంద్రబాబును మెచ్చుకున్న కేటీఆర్.. తెలంగాణ సర్కార్‌పై తీవ్ర విమర్శలు!

మొదటిపేజీ తరువాయి

ఇదే సమయంలో, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పడంపై కేటీఆర్ స్పందించారు. 'నిజం నిలకడ మీద తేలుతుంది' అని వ్యాఖ్యా నించారు. కొండా సురేఖ ఏం చెప్పారో ఇంకా పూర్తిగా చూడలేదని, ఆ వివరాలు చూశాక లీగల్ టీమ్‌తో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇటీవల ఒక పత్రిక కూడా క్షమాపణ చెప్పిందని గుర్తుచేశారు. ముమ్మందు తనపై ఫార్ములా-ఈ రేస్, విద్యుత్ కుంభకోణం వంటి తప్పుడు ఆరోపణలు చేసిన ప్రతి ఒక్కరూ పశ్చాత్తాపంతో క్షమాపణలు చెప్పక తప్పదని ఆయన అన్నారు.కాగా, అంతకుముందు మంత్రి కొండా సురేఖ ఎక్స్ వేదికగా కేటీఆర్‌కు బహిరంగ క్షమాపణలు చెప్పారు. అప్పటి రాజకీయ పరిస్థితుల్లో భాగంగా, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలోనే ఆ వ్యాఖ్యలు చేయాల్సి వచ్చిందని, కేటీఆర్‌ను వ్యక్తిగతంగా బాధపెట్టే ఉద్దేశం తనకు లేదని ఆమె స్పష్టం చేశారు.

ముఖ్యమంత్రి సహకారంతో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి

పినపాక శాఖా గ్రంథాలయ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు

వార్త దీపిక న్యూస్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ, విద్యార్థులు, నిరుద్యోగ యువతకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు తెలిపారు.జిల్లా గ్రంథాలయ సంస్థ పరిధిలోని పినపాక శాఖా గ్రంథాలయంలో నూతన గ్రంథాలయ ఏర్పాటుకు సహకరించిన పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఐటీడీఏ పీవో బి. రాహుల్, జిల్లా గ్రంథాలయ కార్యదర్శి కే. కరుణ కుమారికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధికి సహకరించిన అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, ఇతర సహకారదాతల సేవలను అభినందించారు.

గ్రంథాలయాలు కేవలం పుస్తక పఠన కేంద్రాలుగానే కాకుండా, విద్యార్థుల విద్యాభివృద్ధికి, నిరుద్యోగ యువత భవిష్యత్తుకు బాటలు వేసే విజ్ఞాన కేంద్రాలుగా రూపుదిద్దుకోవాలన్నదే తమ లక్ష్యమని వీరబాబు పేర్కొన్నారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, వారికి అవసరమైన పఠన వాతావరణం, సౌకర్యాలు కల్పించడం ద్వారా ఉద్యోగ సాధనకు తోడ్పడవచ్చని తెలిపారు.జిల్లాలోని శాఖా గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేసి, విద్యార్థులు మరియు యువతకు మెరుగైన సేవలు అందించేందుకు సమష్టిగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. ప్రజాప్రతిని ధులు, ఐటీడీఏ అధికారులు, గ్రంథాలయ శాఖ అధికా రులు సమన్వయంతో ముందుకు రావడం అభినందనీ యమన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం, అధికారుల సహకారంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధిని




మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పసుపులేటి వీరబాబు స్పష్టం చేశారు.

రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ బలహీనపడింది

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా నితిన్ నబీన్ మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా కార్యకర్తలు ప్రజలకు సేవ చేస్తూ, వారి గొంతుకను వీధుల్లో వినిపిస్తారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో ప్రజాస్వామ్యం సురక్షితంగా ఉందని, 140 కోట్ల మంది ప్రజల విశ్వాసం ఆయనపైనే ఉందని స్పష్టం చేశారు.కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వంశపారంపర్య రాజకీయాలకే ప్రాధాన్యం ఇస్తుందని, ఒకే కుటుంబం కోసం జాతీయ ప్రయోజనాలను సైతం పణంగా పెట్టిందని నితిన్ దుయ్యబట్టారు. గతంలో ఎమర్జెన్సీ విధించడం, 90కి పైగా ఎన్నికైన రాష్ట్ర ప్రభుత్వాలను రద్దు చేయడం వంటి చర్యలను ప్రజలు మరిచిపోలేదని, అందుకే ఆ పార్టీని ప్రజాస్వామ్యబద్ధంగా శిక్షిస్తున్నారని అన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వం వల్లే కాంగ్రెస్ పార్టీ నానాటికీ బలహీనపడుతోందని, వరుస ఓటమిలపై ఆ పార్టీ నేతలు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ఓటర్ల జాబితా సవరణపై వ్యాఖ్యలు ఓటర్ల జాబితాను అకౌంట్ల పుస్తకాలతో పోల్చిన నబీన్, వాటిని క్రమం తప్పకుండా తనిఖీ చేసి, తప్పులను సరిదిద్దాలని అన్నారు. ప్రస్తుత జాబితాలలో మరణించిన వారి పేర్లు, నకిలీ ఓట్లు, చిరునామా లేని వ్యక్తుల పేర్లు ఉన్నాయని ఆరోపించారు. అర్హులైన ప్రతి భారత పౌరుడికి ఓటు హక్కు కల్పించడం, అనర్హులను, చొరబాటుదారులను తొలగించడమే ఈ సవరణ లక్ష్యమని ఆయన వివరించారు. 2047 నాటికి భారత్‌ను వికసిత భారత్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, 2029లో కూడా ప్రధాని మోదీ ఎర్రకోటపై జెండా ఎగురవేస్తారని నితిన్ ధీమా వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ మిగిలిన ప్రభావాన్ని కూడా ముఖ్యమంత్రి రేఖా గుప్తా నాయకత్వంలో పూర్తిగా తొలగిస్తామని శపథం చేశారు. కాంగ్రెస్‌కు చెందిన జేఎన్‌యూ ప్రొఫెసర్ ప్రమేయం ఉన్న ఆరోపణలపై రాహుల్ గాంధీ, ఇతర ప్రతిపక్ష నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. పాదయాత్ర అనంతరం కూడా ప్రతి ఇంటికి వెళ్లి, అరాచక రాజకీయాలను ప్రజలకు వివరించాలని, ప్రతిపక్షాల వాదనలను వీధుల్లో, పార్లమెంటులో తిప్పికొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



ఎమ్మెల్యే కోవా లక్ష్మి

వార్త దీపిక న్యూస్

తెలంగాణ రాష్ట్రంలో జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలో పనిచేస్తున్న సుమారు 17 వేల మంది డౌట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఎమ్మెల్యే కోవా లక్ష్మి ప్రభుత్వాన్ని కోరారు.ఎన్నో ఏళ్లుగా ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. కరోనా వంటి క్లిష్ట పరిస్థితుల్లోనూ, గ్రామీణ, గిరిజన, మారుమూల ప్రాంతాల్లోనూ ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు విశేష సేవలు అందించారని పేర్కొన్నారు. గర్భిణులు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రజారోగ్య కార్యక్రమాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమన్నారు. తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులు కుటుంబ పోషణ, పిల్లల చదువులు, వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతున్నారని



తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సేవా కాలం, విద్యార్హతలు, అనుభవం, విధుల స్వభావంపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని కోరారు. ఇతర రాష్ట్రాల్లో ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ఉద్యోగ భద్రత కోసం అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసి, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా అర్హులైన ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ జరిగే వరకు ఉద్యోగులకు తగిన వేతనాలు, సమయానికి జీతాలు, ఇతర సేవా ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సుమారు 17 వేల మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల భవిష్యత్తుకు భరోసా కల్పించేలా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేసి, రెగ్యులరైజేషన్ పై కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆకాష్, వైస్ చైర్మన్ అహ్మద్, సింగిల్ విండో చైర్మన్ అలీ బిన్ హైమద్, నాయకులు రవీందర్, నిసార్, హైమద్, అన్సార్, గుండా శ్యామ్, సందీప్, ఖాసీం, పొన్నాల నారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

TGTEL/26/A5513 వార్త దీపిక

ఎల్ నినో హెచ్చరికలున్నా సింగూర్ నుంచి 22 టీఎంసీలు సముద్రం పాలు..!

సీఎం రేవంత్, మంత్రి దామోదర్ రాజనర్సింహాల పాపమే..!

పంట పొలాల్లో పర్యటించిన మాజీ ఎమ్మెల్యే

కొట్లాడి పరిహారం సాధిస్తాం... రైతులకు కొండంత భరోసా..!

టేక్మాల్ మండలంలో మాజీ ఎమ్మెల్యే సుడిగాలీ పర్యటన





అందోల్, అక్టోబర్ 29, వార్త దీపిక న్యూస్ :

కుసంగి, దన్నారం, కోరంపల్లి, పాల్వంచ, బర్దీపూర్ గ్రామాల్లో ఎండిన వరి, పత్తి పంట పొలాలను మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరాకు రూ. 60 వేల అప్పు చేస్తే రూ.10 వేలు కూడా రాని దుస్థితి అని, పంటల వద్దకు వెళ్లలేక పశువులను మేపుతున్న రైతులు టేక్మాల్‌ను తక్షణమే కరవు జాబితాలో చేర్చాలని కోరారు. ఎల్ నినో విపత్తు ముంచుకొస్తుందని శాస్త్రవేత్తలు రెండేళ్లుగా మొత్తుకుంటున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. స్థానిక మంత్రి దామోదర రాజనర్సింహ దారుణ నిర్లక్ష్యంతో నిండుకుండలాంటి సింగూర్ ప్రాజెక్టు నుంచి ఏకంగా 22 టీఎంసీల మరమ్మత్తు ల పేరుతో నీటిని కిందికి వదిలేసి సముద్రం పాలు చేశారని విమర్శించారు. టేక్మాల్‌ను అల్లదుర్గం, రెగోడ్ మండలాలను కరవు జాబితాలో చేర్చాలి రైతుల అప్పులు రద్దు చేయాలి బీఆర్ఎస్ చేసిన ధర్నాల వల్ల ప్రభుత్వం దిగివచ్చి ఐదు మండలాలను కరవు మండలాలుగా ప్రకటించినప్పటికీ, తీవ్రంగా నష్టపోయిన టేక్మాల్ రెగోడ్ అల్లాదుర్గం మండలాలను విస్మరించడం ముమ్మాటికీ ద్రోహమేనని మండిపడ్డారు .ప్రభుత్వం వెంటనే పక్షపాత వైఖరిని వీడి టేక్మాల్ మండలాన్ని కూడా అధికారికంగా కరవు జాబితాలో చేర్చాలని, వరి-పత్తి పంటలు నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు తగిన నష్టపరిహారాన్ని తక్షణమే బ్యాంక్ ఖాతాల్లో కాకుండా డైరెక్టుగా ఇవ్వాలని, పెట్టిన పెట్టుబడి అంతా నేలపాలైనందున రైతులపై ఉన్న పంట పెట్టుబడి రుణాలను, బ్యాంక్ అప్పులను ప్రభుత్వం బేషరతుగా రద్దు చేయాలని అయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వీరన్న, సొసైటీ అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, మాజీ ఎంపిపి రవి, మైనార్టీ నాయకుడు సలీం, సర్పంచులు మాజీ సర్పంచ్ లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుసంగి, దన్నారం, కోరంపల్లి పాల్వంచ, బర్దిపూర్ గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి, తెలంగాణ మంజీరా న్యూస్ :

జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలోని డీ-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ పరిశీలించారు. ఎస్-నాబ్ ఆధ్వర్యంలో డీ-అడిక్షన్ సెంటర్‌కు ఇండోర్ స్పోర్ట్స్ మెటీరియల్ అందజేశారు. గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలకు బానిసలైన వారిని ఆ వ్యసనం నుంచి బయటపడేలా చూడలన్నారు. అనంతరం డీ-అడిక్షన్ సెంటర్ వైద్యులతో ఎస్పీ మాట్లాడి, కేంద్రానికి వచ్చే వారికి అవసరమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వైద్యపరమైన జాగ్రత్తలు పాటిస్తూ, కౌన్సెలింగ్ ద్వారా మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్న వారికి తగిన సహకారం, ప్రోత్సాహం అందించి, వారిలో సానుకూల మార్పు తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీలక్ష్మి, నోడల్ ఆఫీసర్, డాక్టర్ మురళీకృష్ణ, సూపరింటెండెంట్, డాక్టర్ రవికుమార్, ఆర్ఎంఓ, డాక్టర్ పద్మావతి, ఆర్ఎంఓ, ఎస్-నాబ్ ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రావు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



రాహుల్ సభకు భయల్దేరిన కాంగ్రెస్ నాయకులు

జెండా ఊపి బస్సు ప్రారంభించిన జగ్గారెడ్డి

సంగారెడ్డి, అక్టోబర్ 29, వార్త దీపిక న్యూస్ :

నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో జరిగే రాహుల్ గాంధీ బహిరంగ సభకు హాజరయ్యేందుకు సంగారెడ్డి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బస్సుల్లో బయలుదేరారు. ఐబీ వద్ద అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటి గంటకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి జెండా ఊపి బస్సులను లాంఛనంగా ప్రారంభించారు. సదాశివపేట మండలం నుండి సీడీసీ చైర్మన్ రామ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సిద్దన్న, శ్రీనివాస్ యాదవ్‌లతో కలిపి మొత్తం 46 మంది బయలుదేరారు. కొండాపూర్ మండలం నుంచి ఆత్మ చైర్మన్ ప్రభు, నాయకులు నర్సింహారెడ్డి, మల్లారెడ్డిలతో కలిపి 26 మంది ఢిల్లీ పయనమయ్యారు. నిర్మల జగ్గారెడ్డి, భరత్ సాయిరెడ్డిలతో సహా సంగారెడ్డి నియోజకవర్గం నుంచి మొత్తం 150 మంది కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ సభకు హాజరుకానున్నారు. బస్సుల ప్రారంభ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత్ కిషన్, నాయకులు కూన సంతోష్, కిరణ్ గౌడ్, మహేష్ ముదిరాజ్, శ్రీహరి, సుదీప్, బబ్బు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

టాఫిక్ సిబ్బందికి అందించిన సేఫ్టీ కిట్లు, ట్రాఫిక్ పరికరాల పరిశీలిన

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పటిష్టమైన ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్

జాతీయ రహదారులపై ప్రమాదాల స్పాట్ లను గుర్తించాలి

జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్





సంగారెడ్డి, అక్టోబర్ 29, వార్త దీపిక న్యూస్ :

వార్షిక తనిఖీల్లో భాగంగా సంగారెడ్డి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిబ్బందికి అందించిన సేఫ్టీ కిట్లు, ట్రాఫిక్ నియంత్రణకు ఉపయోగించే పరికరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి, విధుల నిర్వహణకు సంబంధించిన వివరాలను సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రమాదాలకు తావులేకుండా పటిష్టమైన ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. క్రమం తప్పకుండా వాహన తనిఖీలు చేపడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులపై తరచూ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్లుగా గుర్తించి, వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అవసరమైన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల సమన్వయంతో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటూ, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్పీ వెంట డీఎస్పీ సత్యయ్య గౌడ్ తదితరులు ఉన్నారు.



మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం

జహీరాబాద్, అక్టోబర్ 29, వార్త దీపిక న్యూస్ :

న్యాల్కల్ మండల పరిధిలోని రాజోల గ్రామంలో కొద్ది రోజుల క్రితం పార్టీ కార్యకర్త అశోక్ భార్య స్వరూప ఆకాల మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎస్సి కార్పొరేషన్ మాజీ చేర్మెన్ వై. నరోత్తం గురువారం వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామం సర్పంచ్ వెంకట్ రావు పాటిల్, మాజీ సర్పంచ్ సత్యానారాయణ, వై. తరుణ్,నాయకులు శివకుమార్, చెంగల్ జైపాల్, భీమన్న, బస్వరాజ్, పాండప్ప, మల్లప్ప, సంగు, రమేష్, నందు, అశోక్, మారుతి, రఘు, తదితరులు ఉన్నారు.

సమస్యలపై కలెక్టర్‌కు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ వినతి

సంగారెడ్డి, అక్టోబర్ 29, వార్త దీపిక న్యూస్ :



ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో సంబంధిత అధికారులను అప్రమత్తం చేసి, దాని ప్రభావంతో ప్రజలకు, రైతులకు కలిగే నష్టాలను ముందుగానే అరికట్టేలా సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను కోరారు. నియోజకవర్గంలోని పలు ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, తాగునీరు, సాగునీరు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలుపై జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్యత క్రమంలో గుర్తించి, తక్షణమే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పలు సమస్యలపై ప్రజలను నేరుగా కలెక్టర్ వద్దకు తీసుకెళ్లి, వారి ఇబ్బందులను వివరించారు. సింగూర్ ప్రాజెక్టు నీటి నిర్వహణలో ముందస్తు ప్రణాళిక, దూరదృష్టి లోపించడం వల్ల ఉమ్మడి మెదక్ జిల్లాలో తీవ్రమైన తాగునీటి సమస్య తలెత్తే పరిస్థితి ఏర్పడిందని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆందోళన వ్యక్తం చేశారు. సముద్రాలపై వంతెనలు నిర్మించే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్న ప్రస్తుత కాలంలో, సింగూర్ ఆనకట్ట రివెట్‌మెంట్ మరమ్మతుల కోసం ప్రత్యామ్నాయ ఆధునిక సాంకేతిక పద్ధతులను ఎందుకు వినియోగించలేదని అన్నారు. హనుమాన్ నగర్, చేర్యాల, ఆరుట్ల, బ్యాతల్ గ్రామాలకు సంబంధించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ చేయాలని కోరారు. ఇళ్ల నిర్మాణం కోసం స్థలం ఇచ్చిన వారికి లబ్ధిదారుల ఎంపికలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పూర్తికాని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన చోట కొత్త బోర్లు వేయడంతోపాటు ప్రజలకు నీటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు.



TGTEL/26/A5513 వార్త దీపిక

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించిన డీ టీ డబ్ల్యూ ఓ నాగసాగర్.

వార్త దీపిక న్యూస్

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పౌష్టికాహారం అందించాలని డీ టీ డబ్ల్యూ ఓ నాగసాగర్ ఆదేశించారు.జయశంకర్ భూపాలపల్లి పట్టణంలోని గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ సందర్శించి పాఠశాలలోని విద్యా, వసతి సౌకర్యాలను పరిశీలించారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు శాతం, తరగతి గదుల నిర్వహణ, బోధనాభ్యసన కార్యక్రమాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వారి చదువుల పురోగతి, సబ్జెక్టులపై అవగాహన, ఎదురవుతున్న సమస్యల గురించి తెలుసుకున్నారు.అనంతరం బాలికల వసతి గృహాన్ని సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్లు, పరిసరాల పరిశుభ్రత, భోజనశాల, వంటగది తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన, పౌష్టికాహారాన్ని నిర్ణీత మెనూ ప్రకారం అందించాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ మాట్లాడుతూ.. గిరిజన విద్యార్థినుల విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, విద్యార్థులు విద్యలో రాణించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి మెరుగైన ఫలితాలు సాధించేలా ప్రణాళికాబద్ధంగా బోధన నిర్వహించాలని తెలిపారు. విద్యార్థినులకు చదువుతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు. పాఠశాల మరియు వసతి గృహంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని, విద్యార్థుల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత సిబ్బందికి సూచించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయులు, వసతి గృహ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగసాగర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సమ్మయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.





నాగులమల్యాల ప్రభుత్వ పాఠశాలను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

వార్త దీపిక న్యూస్

నాగులమల్యాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మల్యాల రాజాగౌడ్, అమిరిశెట్టి కనకయ్య పరిశీలించారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు శిథిలావస్థలో ఉన్న వంటగది స్థానంలో కొత్త వంటగదిని నిర్మించాలని, గ్రామంలోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు సహకరించాలని కోరారు. ప్రభుత్వం అల్పాహారం అందించడంపై విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.



బాలల పరిరక్షణకు దేశవ్యాప్త ప్రచారం

వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు.

అతిథులుగా పాల్గొన్న జడ్జీలు

మొబైల్ ను జాగ్రత్తగా వాడటం అలవాటు చేసుకోవాలి.

వార్త దీపిక న్యూస్

జాతీయ, తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవల అథారిటీచే ప్రారంభించబడిన సురక్షిత్ బచ్‌పన్ అభియాన్, పిల్లలను రక్షించడానికి ఉద్దేశించిన దేశవ్యాప్త ప్రచారం. జయశంకర్ భూపాలపల్లి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాలు జరిగాయి. భూపాలపల్లి మండలం లోని గోర్లవీడు ప్రభుత్వ పాఠశాలలో సమావేశం నిర్వహించారు.అతిదిగ పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి తాడూరు మహతి వైష్ణవి మాట్లాడుతూ దేశ బంగారు భవిష్యత్తు నేటి బాలల పరిరక్షణతో సాధ్యమన్నారు.పోక్సో నేరాల నివారణ, సైబర్ మోసాల నుండి పిల్లల్ని కాపాడుకోవడం మన ప్రథమ కర్తవ్యం అని తెలిపారు. విద్యార్థులు పాఠశాల స్థాయినుండి అవగాహనా కలిగి ఉండాలని సూచించారు. మొబైల్ ను జాగ్రత్తగా వాడటం అలవాటు చేసుకోవాలి అని పేర్కొన్నారు. కొత్తపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన మరో కార్యక్రమంలో అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని పేర్కొన్నారు. పెద్దాపూర్ ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల మాట్లాడుతూ ప్రతి బిడ్డ బాల్యం మనందరి బాధ్యత అని అన్నారు. చాలా మంది పిల్లలకు తమ హక్కులు తెలియవు, సహాయం ఎలా పొందాలో తెలియదు. దీన్ని మార్చడమే ఈ ప్రచారం లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వెంకటస్వామి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, సూపరింటెండెంట్ రఘురాం, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది అంబాల దేవేందర్, గోపాల్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



దేశంలోని టాప్-10 వినూత్న ఉపాధ్యాయుల్లో పారమిత టీచర్‌కు చోటు

తెలంగాణ నుంచి ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడు లలిత్ మోహన్ సాహు

వార్త దీపిక న్యూస్

కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల సీనియర్ ఉపాధ్యా యుడు, ప్రాజెక్ట్స్ అండ్ ఇన్నోవేషన్ హెడ్ లలిత్ మోహన్ సాహు జాతీయ స్థాయిలో అరుదైన ఘనత సాధించా రు. దేశవ్యాప్తంగా సుమారు 37 వేల దరఖాస్తుల నుంచి ఎంపికైన టాప్-10 వినూత్న ఉపాధ్యాయుల్లో ఆయన కు చోటు దక్కింది. అక్టోబర్ 28న న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు వివో ఇగ్నైట్ టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషి ప్-2026 అందజేశారు. తెలంగాణ నుంచి ఈ ఫెలోషిప్‌కు ఎంపికైన ఏకైక ఉపాధ్యాయుడిగా ఆయన గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా ప్రశంసాపత్రం, జ్ఞాపికతో పాటు రూ.లక్ష విలువైన టీచర్ ఇన్నోవేషన్ ఫెలోషిప్ గ్రాంట్ కిట్‌ను అందించారు. గత 25 ఏళ్లుగా పారమిత విద్యాసంస్థల్లో సేవలందిస్తున్న లలిత్ మోహన్ సాహు, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ ఆలోచనా విధానం, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. ఆయన సాధించిన ఘనతపై పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాదరావుతో పాటు పాఠశాల డైరెక్టర్లు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేసి అభినందించారు.



గణపురం మండలంలో రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన.



వార్త దీపిక న్యూస్

జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండల పరిధిలోని పలు గ్రామాల్లో రూ.1.50 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అంగన్వాడీ, మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు శంకుస్థాపన చేశారు .చెల్పూర్ గ్రామంలో రూ.20 లక్షలతో అంగన్వాడీ భవన నిర్మాణానికి, మహిళా సమైక్య భవనాలకు రెండు చోట్ల రూ.10 లక్షల చొప్పున శంకుస్థాపన చేశారు. లక్ష్మారెడ్డిపల్లిలో రూ.10 లక్షలు, కరకపల్లిలో రూ.10 లక్షలతో మహిళా సమైక్య భవనాల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గాంధీనగర్‌లో రూ.20 లక్షలతో అంగన్వాడీ భవనం, గణపురం మండల కేంద్రంలో మూడు అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి రూ.60 లక్షలు, బురకాయలగూడెంలో మహిళా సంఘం భవనానికి రూ.10 లక్షలతో చేపట్టనున్న పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు మహిళలు, చిన్నారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఆర్జీ-2 లో ఉద్యోగులకు క్వార్టర్ల కేటాయింపు - పారదర్శకంగా కౌన్సిలింగ్

వార్త దీపిక న్యూస్

సింగరేణి ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా ఆర్జీ-2 ఏరియాలోని సెక్టార్-3 కాలనీలో ఖాళీగా ఉన్న క్వార్టర్లను గ్రూప్-1 లోని ఆర్జీ-2 ఏరియా, ఆర్జీ-3 లోని ఓసీపీ-1, ఆర్జీ-1 లోని జేడీకే-11 ఇంక్లైన్ కు చెందిన అర్హులైన ఉద్యోగులకు కేటాయించేందుకు గురువారం కౌన్సిలింగ్ నిర్వహించారు.యైటింక్లైన్ కాలనీలోని సి ఈ ఆర్ క్లబ్ లో జరిగిన కౌన్సిలింగ్ కు సెక్టార్-3 లోని 502 క్వార్టర్లు అందుబాటులో ఉండగా, 90 మంది ఉద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. సీనిలకు మెరుగైన నివాస సౌకర్యం కల్పించడం ద్వారా వారి పని సామర్థ్యం పెరిగి సంస్థ అభివృద్ధికి దోహదపడుతుంది. అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చూస్తాము అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రటరీ గంధం సాంబశివరావు, సీనియర్ పిఓ (ప) సింగ్ శ్రీనివాస్, సివిల్ ఈఈ సోనియా, క్వార్టర్ సెక్షన్ జూనియర్ అసిస్టెంట్ మమత, షిఫ్ట్ జమేదార్ తక్కళ్ళ రాములు, క్వార్టర్ సెక్షన్ గార్డ్ రాజ్ కుమార్, సేవాసమితి కో-ఆర్డినేటర్ గొర్రె అనూష తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తాం: యాదగిరి సునీల్ రావు

వార్త దీపిక న్యూస్

నగరంలోని డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు బీజేపీ పాలకవర్గం కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు తెలిపారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నాయకత్వంలో డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. రూ.18 కోట్ల స్వచ్ఛ భారత్ నిధులతో బయోమైనింగ్ పనులకు టెండర్లు పూర్తయ్యాయని, మరో 10 రోజుల్లో వర్క్ ఆర్డర్ ఇచ్చి 9 నెలల నుంచి ఏడాది లోపు డంపింగ్ యార్డ్‌లోని చెత్తను తొలగించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. అనంతరం రూ.80 కోట్లతో ఆధునిక సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి, రోజువారీ చెత్తను ప్రాసెస్ చేసేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు.





Printed, published & Owned by erlla pavan kumar, printed at Saketh Publications, #sy. No-312, Trinetra comples Sangareddy, Telangana -502001.Editor erlla pavan kumar, Rni Regn. No.TG TEL/26/A5513.Email:pavanerla@gmail.como.offic:4-7-25b/h.balajinagar sangareddy :cell:9666466984